# కల్చరల్ మర్చెంట్స్

ఈ మధ్య సర్వత్రా కల్చరల్ యాక్టివిటీ బాగా పెరిగిపోయింది. సాంస్కృతిక సంస్థలు జూనియర్ కాలేజీల్లాగా వీధి కొకటి చొప్పున వెలుస్తున్నాయి. కళలని, కళ్ళాకారుల్ని ప్రోత్సహించేందుకు పోషించేందుకు సాంస్కృతిక సంస్థల ఆవశ్యకత ఎంతయినా వుంది. కాదనలేం. కానీ కల్చరు పేరిట లావాదేవీలు మొదలయినాయనీ వినికిడి . మీకు అట్టహాసంగా సన్మానం చేస్తాం ఎంతిస్తారు. మీకు ఫలానా బిరుదిస్తాం లేదు అవార్డిస్తాం – ఇంతిస్తారా ! ఇలా ఉంటున్నాయిట ఆఫర్స్ చాలా కాలంగా ఆ లైన్లో వుండి, ఆత్మశుద్ధి కోసం బయటికొచ్చిన ఒక మిత్రుడు అడిగితే చెప్పుకొచ్చేడు. కల్చరల్ సంస్థ చేతిలో వుంటే ఆ దారేవేరట. పరిచయాలు పెరుగుతాయట . పెద్ద పెద్ద వాళ్ళంతా సన్మానాలు చేయమని ఫీలర్సు పంపిస్తారట. మనకి గవర్నమెంటులో ఏ విధమైన పని పెండింగున్నా సదరు ఆఫీసర్నో , మంత్రినో పిల్చి పూలదండ వేసి సభాముఖంగా అర్చిస్తే కాదనలేట్ట, – కాదంటే కల్చర్లెస్ ఫెలో అంటారన్న భయంకొద్దీ.

పాత రోజుల్లో ప్రసిద్ధులయిన రచయితనో, కళాకారులనో , వేదిక నెక్కించి అతడి కృషిని అభినందించి, ఆశీర్వదించేవాళ్ళు. కాని ఇప్పుడు పరిస్థితి వేరు. ముక్కూ మొహం తెలీని వాళ్ళకి సైతం సన్మానాలు చేసేస్తున్నారు. ఫీల్డు బాగుంది. సంవత్సరానికి ముగ్గురికో , నలుగురికో , సన్మానాలు చేసుకుంటే తేలిగ్గా ఇల్లు కట్టుకోవచ్చు, కట్టుకున్న మహానుభావులున్నారు. ఇంకాస్త విజృంభించి సినిమా వాళ్ళని కూడా ముగ్గులోకి దింపగలిగితే – మరీ మంచిది, బంగారం. అడపిల్ల తండ్రులకి పూర్వం సానుభూతి వుండేది. ఏ చందాలకో బయల్దేరినప్పుడు ' పాపం – మొన్నే పిల్ల పెళ్ళి చేసాడయ్యా . ఇంకా తేరుకోలేదు. పోనీండి ' అనేవాళ్ళు కాని ఇప్పుడా సానుభూతి సన్మానం చేయించకున్నవాళ్ళు కొట్టేస్తున్నారు. మొన్న తుపాను బాధితుల సహాయార్థం చందాకోసం వెడితే ఒక పెద్ద మనిషి చేతులు జోడించి ' సన్మానం చేయించుకుని దెబ్బ తిని వున్నాను. ఈసారికి నన్ను వదిలేయండి. మళ్ళీసారి చూద్దాం ' అన్నాడు. నిజాయితీగా , స్వచ్ఛందంగా , ఫలా పేక్ష లేకుండా కళల, సంస్కృతిని ప్రోత్సహించి కృషి చేస్తున్న సంస్థలు లేకపోలేదు. కాని తమ స్వంత లాభం కోసం వ్యాపార

పద్ధతిలో సంస్థల్ని నడుపుతున్న కొద్ది మంది వల్ల అందరికీ చెడ్డ పేరు, అనుమానాలు పుట్టుకొస్తున్నాయి.

ఆడవాళ్ళు పొరిగింటి వాళ్ళతో గోడల పై నుంచి ' మొన్న మీ వారికి సన్మానం అయిందటగా. ఎంతలో అయిందని అంటూ కూరలు గురించి, చీరెల గురించి చర్చించుకున్నంత తేలిగ్గా మాట్లాడుకునే స్థితికి దిగజార్చారు ఈ సన్మానాలని – ఈ మధ్యన ఇదంతా గమనిస్తున్న మిత్రుడొకడు గొప్ప సలహా పారేశాడు. – సినిమా హాల్సులోనూ , టీ.వి రేడియోల్లోనూ మంచి ముఖ్యమైన సమయం అప్పుడు – అంటే వార్తల ముందు సినిమా పాట ససమయంలోనో చిన్న చిన్న ప్రకటనలు వేసి పబ్లిక్కుని ఎడ్యుకేట్ చేస్తే ఎలా ఉంటుందని. మచ్చుకి ఒకటి రెండు చెప్పాడు. ' సన్మానాలు ఆర్థిక ఇబ్బందులకి మూలం ' అనో ' సన్మాన ప్రలోభానికి లోను కాకండి. సరైన నిర్ణయం తీసుకోండి ' ఇలా వుండాలట.

సన్మానాలకి, అభినందలకి ఏవిటి తేడా అని సన్మానం చేయించుకోవాలని వువ్విళ్ళూరి పోతున్న ఒక ముసలాయన అడిగారు. తేడా పెద్ద ఏం వుండదు – శాలువా తప్ప అన్నాన్నేను. అభినందన అంటే భుజం తట్టడం. సన్మానం అంటే చాల్లే వూరుకో అనడం. అంచేత శాలువా లేకపోయినా అభినందన బెటరు. సన్మానాల్లో కూడా తరగతులు, రకాలు వున్నాయి. పేద సన్మానాలు , ఘన సన్మానాలు, ఘోర సన్మానాలు , పూర్ సన్మానాలు అని – పేద సన్మానాలకి పుర ప్రముఖులుంటారు. ఘన సన్మానాలకి ఘనాపాటీల్లాంటి వక్తలుంటారు. ఘోర సన్మానాల్లో పర భాషా వక్తలుంటారు. పూర్ సన్మానాలకి ఎవరూ వుండరు – చేసేవాడు, చేయించుకునేవాడు తప్ప. అంచేత ఏ రకం సన్మానం కావాలో తేల్చుకోండి, దాన్ని బట్టి రేటుంటుంది.

ఆ మధ్యన ఒక ఊళ్ళో ఒకానొక సంస్థ వాళ్లు వెరైటీగా వుంటుందని , ఎందుకు పనికిరాని పరమ చెత్త వ్యక్తికి, చాతకాని వాడికి సన్మానం చేయాలని తలపెట్టి వూరంతా ప్రకటించేరట. ఎవరూ ముందుకు రాలేదట. ఒక్కవ్యక్తి తప్ప, ఆ ఒక్కడ్ని పిలిపించి నువ్వు చేతకాని వాడివని ఋజువు చేసుకొమ్మన్నారట. అందుకా వ్యక్తి ఫిలాసఫీగా నవ్వి పాతికేళ్ళుగా సాంస్కృతిక సంస్థని నడుపుకుంటూ వుస్తున్నాను , పొలం , ఇల్లు , బంగారం అన్ని అమ్మి కళా వేదికకి నైవేద్యం చేశాను. చివరికి వీధిన పడ్డా, మీలాగా కళలని , కల్చర్ని కూడా సంపాదనకి ఉపయోగించు కోవచ్చన్న తెలివితేటలు లేని వాడ్ని, పనికిరాని వాడిని కాక మరేమిటన్నాడట !

------- అయ్యిపోయింది -------